క్లుప్తంగా

అభివృద్ధి ప్రణాళికలో భాగస్వాములు కావాలి

ఎంపీపీ మెర్సీవనజాక్షి



విస్సన్నపేట: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఎంపీపీ పిల్లి మెర్సీవనజాక్షి అన్నారు. స్థానిక వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయం మీటింగ్ హాల్‌లో మండల స్థాయి పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లకు శిక్షణా కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై నిర్వహిస్తున్న శిక్షణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ కె. సురేష్, ఆయా గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ప్రణాళికాబద్ధంగా పనిచేయాలి

ముసునూరు: గ్రామాల అభివృద్ధికి ప్రణాళికాబద్ధంగా పనిచేయాలని ఎంపీపీ కొండా దుర్గాభవాని వెంకట్రావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో బుధవారం ఎంపీడీఓ జి.రాణి అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక, బ్లాక్ డెవలప్‌మెంట్ అభివృద్ధి ప్రణాళికపై రెండు రోజుల శిక్షణ తరగతులను బుధవారం ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ సత్యనారాయణ, ఎంఈఓ బీవీ సుబ్బారావు, ఏవో మధుమోహన్, ఏఈ సత్యప్రసాద్, పర్యవేక్షకుడు సాయిరాము, ఎంపీటీసీలు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఉపాధి పనుల్లో ఇంకుడు గుంతల తవ్వకం



ఆంజనేయపురం(తిరువూరురూరల్): భూగర్భ జలాల పెంపునకు తీసుకుంటున్న చర్యల్లో భాగంగా మండలంలోని ఆంజనేయపురంలో బుధవారం ఉపాధి హామీ పథకం కింద ఇంకుడు గుంతల తవ్వకం చేపట్టారు. గ్రామానికి రక్షిత మంచినీరందించే బోర్ వెల్స్ సమీపంలో ఇంకుడు గుంతలను తవ్వి వర్షం నీటిని నిల్వ చేయనున్నట్లు సర్పంచి మామిడి కుటుంబరావు తెలిపారు. వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

సీఐ సత్యనారాయణ బాధ్యతల స్వీకారం



ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నూతన సీఐగా ముత్యాల సత్యనారాయణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ సీఐగా పనిచేసిన పి. శ్రీను విజయవాడ ఎన్నికల సెల్‌కు బదిలీ అయ్యారు. నియోజకవర్గంలో మైలవరం, ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్లలో మూడేళ్లుగా శ్రీను విధులు నిర్వహించారు. రానున్న సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆయనను బదిలీ చేశారు. వీఆర్‌లో ఉన్న సత్యనారాయణ ఇక్కడకు వచ్చారు. స్టేషన్ ఎస్‌ఐలు ధర్మరాజు, విజయలక్ష్మి, పాపారావు తదితరులు సీఐ పి.శ్రీనుకు వీడ్కోలు, నూతన సీఐ ముత్యాల సత్యనారాయణకు స్వాగతం పలికారు.

మాజీ మంత్రి పాలడుగు సోదరుడు వెంకట సత్యనారాయణ మృతి

ముసునూరు: నూజివీడు కాంగ్రెస్ నేత, మాజీ మంత్రి పాలడుగు వెంకట్రావు సోదరుడు వెంకట సత్యనారాయణ (78) అనారోగ్యంతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. మండలంలోని చింతలవల్లి శివారు గోగులంపాడుకు చెందిన ఆయన నూజివీడులోని ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడని తెలిపారు. పలు పార్టీలకు చెందిన నేతలు, కాంగ్రెస్ నాయకులు, అభిమానులు ఆయన మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సొసైటీ అధ్యక్షుడు నాగళ్ళ వెంకటేశ్వరరావు, నియోజకవర్గ కాంగ్రెస్ నేతలు బీడీ రవి కుమార్, కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షుడు వలసపల్లి రాముడు, మాజీ సర్పంచ్ మాదల బేబి సుజాత, గ్రామ ప్రముఖులు పర్వతనేని గంగాధర్ తదితరులు నివాళులర్పించారు.

ఆర్థిక సాయం అందజేత

ముసునూరు: కిడ్నీ వ్యాధితో చికిత్స పొందుతూ మృతిచెందిన యువకుని కుటుంబానికి నూజివీడు ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆర్థిక సాయం అందించారని వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కంబాల రాంబాబు తెలిపారు. కాట్రేనిపాడు గ్రామానికి చెందిన కలపాల నాగేశ్వరరావు కుమారుడు శివశంకరరావు (27) కిడ్నీ సంబంధిత వ్యాధితో హైదరాబాద్‌లోని నిజాం ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. బుధవారం బాధితుని తండ్రికి ఎమ్మెల్యే పంపిన ఆర్థిక సాయాన్ని స్థానిక నాయకులు అందజేశారు.

రసవత్తరంగా క్రీడా పోటీలు



మండల స్థాయి ఖోఖో విజేత వేమిరెడ్డిపల్లి టీంతో వ్యాయామోపాధ్యాయులు



టాస్ వేస్తున్న పంచాయతీ కార్యదర్శి నాగరాజు

జి.కొండూరు: ఆడుదాం ఆంధ్రా క్రీడాపోటీలు రసవత్తరంగా జరుగుతున్నారు. కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి క్రికెట్ పోటీల్లో మునగపాడు గ్రామానికి చెందిన జట్టు పై చేయి సాధించింది. మండల పరిధి వెలగలేరు జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఫైనల్ క్రికెట్ పోటీల్లో కట్టుబడిపాలెం జట్టుపై విజయం సాధించిన మునగపాడు జట్టు ప్రథమ స్థానాన్ని కైవశం చేసుకుంది. ఈ పోటీలలో భాగంగా అన్ని విభాగాలలో ప్రథమ స్థానంలో నిలిచిన జట్లు నియోజకవర్గ స్థాయిలో పోటీ పడతాయని ఎంపీడీఓ అనూరాధ తెలిపారు. గ్రామ సచివాలయ, మండల స్థాయిలో ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం విజయవంతమయ్యేందుకు కృషి చేసిన ప్రతి ఒక్కరికీ ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

● విస్సన్నపేట: ఆడుదాం ఆంధ్రా మండల స్థాయి క్రీడా పోటీలు ఉత్సాహంగా జరుగుతున్నాయి. స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ గ్రౌండ్‌లో మండల స్థాయి ఖోఖో పోటీలు బుధవారం నిర్వహించారు. సచివాలయ స్థాయిలో ఎంపికైన 14 టీంలు మండల స్థాయి క్రీడా పోటీల్లో పాల్గొనగా వేమిరెడ్డిపల్లి సచివాలయం పరిధిలోని టీం మండల స్థాయి పోటీల్లో విజేతగా నిలిచి నియోజకవర్గ స్థాయి పోటీలకు ఎంపికైంది.

క్రికెట్‌లో మండల స్థాయి విన్నర్ పోలవరం జట్టు

చాట్రాయి: మండలంలోని చాట్రాయి జెడ్పీ హైస్కూల్‌లో నిర్వహించిన మండల స్థాయి 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో పోలవరం జట్టు విన్నర్‌గా నిలిచింది. బుధవారం పురుషుల క్రికెట్ ఫైనల్ పోటీల్లో పోలవరం, చాట్రాయి జట్ల మధ్య పోటీ జరిగింది. 10 ఓవర్లల్లో పోలవరం జట్టు 68 పరుగులు, చాట్రాయి 60 పరుగులు చేశాయి. 8 పరుగుల తేడాతో పోలవరం జట్టు విన్నర్‌గా నిలిచింది. మహిళల క్రికెట్ పోటీల్లో కోటపాడు జట్టు 31 పరుగులు, చీపురుగూడెం జట్టు 30 పరుగులు చేశాయి. ఒక్క పరుగు తేడాతో కోటపాడు జట్టు విజేతగా నిలిచింది. ఈ పోటీలకు సతీష్, ప్రభాకర్, విజయ్‌లు ఎంపైర్లుగా వ్యవహరించారు.

● ఆగిరిపల్లి: 'ఆడుదాం ఆంధ్రా' క్రీడా పోటీల్లో భాగంగా బుధవారం అడవినెక్కలం జిల్లా పరిషత్ హైస్కూల్లో సర్పంచ్ వేము రాజు టాస్ వేసి మండల స్థాయి కబడ్డీ పోటీలను ప్రారంభించారు. మండలంలో మహిళల క్రికెట్, బ్యాడ్మింటన్, కబడ్డీ, పురుషుల కబడ్డీ పోటీలు నిర్వహించామని ఈఓపీఆర్డీ శేఖర్ తెలిపారు.



మండల స్థాయి క్రికెట్ పోటీల్లో ప్రథమస్థానం సాధించిన మునగపాడు జట్టు



అడవినెక్కలంలో కబడ్డీలో తలబడుతున్న క్రీడాకారులు

చెరువు స్థలం వివాదంలో ఇరువర్గాల ఘర్షణ

మైలవరం: మైలవరం విజయవాడ రోడ్డులోని చిన్న చెరువుకు సంబంధించి చెరువు పోరంబోకు స్థలం విషయంలో రెండు సామాజిక వర్గాల మధ్య బుధవారం ఘర్షణ జరిగింది. గత ప్రభుత్వ హయాంలో ఈ స్థలాన్ని అప్పటి తహసీల్దార్ జర్నలిస్టుల ఇళ్ల స్థలాలకు కేటాయించి పట్టాలు కూడా అందజేశారు. అయితే స్థానికంగా ఉండే చిన్న దళితవాడకు చెందిన కొందరు ఈ స్థలం తమదేనంటూ అడ్డుకున్నారు. ప్రస్తుతం ఈ స్థలం విషయంలో స్థానికంగా ఉండే వడ్డెర కమ్యూనిటీ వారు, చిన దళితవాడకు చెందిన వారు స్థలం మాదంటే మాదంటూ ఘర్షణకు దిగారు. ఈ స్థలంలో గతంలో దళితవాడ కాలనీ వాసులు చర్చి నిర్మించుకున్నారు. గత 30 ఏళ్లుగా తాము చర్చిని నడుపుతున్నామని, ఈ స్థలం చర్చికి పక్కనే ఉందని, ఇది మాదేనంటూ దళితవాడ వాసులు చెబుతున్నారు. ఖాళీ స్థలంలో దళితులు కమ్యూనిటీ హాల్ నిర్మాణం చేపట్టగా వడ్డెర సామాజిక వర్గం వారు అడ్డుకున్నారు. నిర్మాణం తాత్కాలికంగా నిలిచిపోయింది. ఈ ఘర్షణలో పలువురు స్వల్పంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని ఇరువర్గాలను చెదరగొట్టి పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చారు. గాయపడిన వారిని స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

సంక్రాంతి క్రీడా పోటీలు ప్రారంభం

తిరువూరు: మండలంలోని ముష్టికుంట్లలో సంక్రాంతి సందర్భంగా బాల్ బ్యాడ్మింటన్ టోర్నమెంట్‌ను బుధవారం ప్రారంభించారు. ఈ నెల 20వ తేదీ వరకు జరిగే ఈ పోటీల్లో ఏ ప్రాంతం వారైనా పాల్గొనవచ్చని, రూ.40 వేలు ప్రథమ బహుమతి, రూ.30 వేలు ద్వితీయ బహుమతి, రూ.20 వేలు తృతీయ బహుమతి, రూ.15 వేలు నాలుగో బహుమతిగా అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఇతర వివరాలకు సెల్: 98661 59901 నంబరును సంప్రదించాలని కోరారు.

రూ.77.5 లక్షలతో రైతు బజారు నిర్మాణం



నిర్మాణంలో ఉన్న మైలవరం రైతు బజారు

మైలవరం: మైలవరం రైతు బజారులో షాపుల నిర్మాణం శరవేగంగా జరుగుతోంది. వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత అభివృద్ధే ధ్యేయంగా పనులు జరుగుతున్నాయి. గత ప్రభుత్వ హయాంలో రైతు బజారు వర్షానికి చిత్తడిగా మారి షాపులు వర్షానికి తడిచిపోయి కూరగాయలు అమ్ముకునే రైతులు, వినియోగదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యేవారు. ఈ విషయాన్ని స్థానిక ఏఎంసీ చైర్మన్ దృష్టికి రైతులు తీసుకువెళ్లడంతో ఆయన స్పందించి ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ సహకారంతో రైతు బజారు అభివృద్ధికి నిధులు మంజూరు చేయించారు. రైతు బజారులో పాత రేకుల షెడ్లు తొలగించి ప్రస్తుతం రూ.77.5 లక్షల అంచనాలతో కొత్తగా 58 షాపులు నిర్మాణం చేపట్టారు. నేలను చదును చేయించి, వర్షం నీరు ప్రాంగణంలో నిలువకుండా మెరక పనులు చేపట్టారు. షాపుల నిర్మాణానికి పిల్లర్లు పోసి పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

షాపుల నిర్మాణం వేగంగా జరుగుతోంది

మైలవరంలోని రైతు బజారులో షాపుల నిర్మాణం చురుగ్గా సాగుతోంది. గతంలో ఇరుకుగా ఉండి వినియోగదారులు తిరగడానికి ఇబ్బంది పడేవారు. ప్రస్తుతం షాపుల నిర్మాణం వినియోగదారులకు సౌకర్యంగా ఉండేలా నిర్మిస్తున్నారు. వర్షాకాలంలో కూడా ఇబ్బంది పడాల్సిన పని ఉండదు.

– రంగారావు, రైతు, మైలవరం

అంబేడ్కర్ విగ్రహావిష్కరణను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న స్వామిదాసు

తిరువూరు: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం ఈనెల 19వ తేదీన విజయవాడలో జరుగనుందని, ప్రజలంతా తరలివచ్చి కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లగట్ల స్వామిదాసు అన్నారు. నగర పంచాయతీ కార్యాలయంలో బుధవారం కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గం నుంచి 60 ప్రత్యేక వాహనాల్లో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి జనసమీకరణ చేస్తున్నామని చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా 206 అడుగుల ఎత్తున అంబేడ్కర్ విగ్రహాన్ని విజయవాడలో ఏర్పాటు చేయడం చారిత్రాత్మకమన్నారు. నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి, మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ నల్లగట్ల సుధారాణి, ఏరియా ఆస్పత్రి అభివృద్ధి కమిటీ వైస్ చైర్మన్ రేగళ్ల మోహన రెడ్డి, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, వార్డు కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం



పుల్లూరు(మైలవరం): మైలవరం మండలం చిలుకూరువారిగూడెం శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల సమ్మేళనం బుధవారం పాఠశాల ప్రాంగణంలో జరిగింది. చిలుకూరువారిగూడెం శ్రీ అప్పిడి సుబ్బారెడ్డి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1995–1996 సంవత్సరం పదో తరగతి బ్యాచ్ పూర్వ విద్యార్థులు కలుసుకుని క్షేమ సమాచారం తెలుసుకున్నారు. తాము చదువుకున్న రోజులను గుర్తుచేసుకుని రోజంగా ఉల్లాసంగా గడిపారు. ఈ సందర్భంగా తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను సన్మానించి ఆశీస్సులు అందుకున్నారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



దాతలకు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఆలయ అధికారి

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధిలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని అందజేశారు. విజయవాడ భవానీపురానికి చెందిన డి.శోభన్‌బాబు కుటుంబం అమ్మవారిని దర్శించుకునేందుకు విచ్చేశారు. ఈ సందర్భంగా నిత్యాన్నదానానికి రూ.1,01,116 విరాళాన్ని అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించిన ఏఈవో ఎస్. రమేష్‌బాబు దాతలకు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

ఏఎంసీ కార్యదర్శిగా జ్యోతి

తిరువూరు: తిరువూరు గ్రేడ్–1 వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యదర్శిగా జ్యోతి నియమితులయ్యారు. నందిగామ మార్కెట్ కమిటీ నుంచి ఆమె తిరువూరుకు బదిలీపై రాగా, ఏఎంసీ చైర్మన్ శీలం నాగనర్సిరెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేస్తున్న కార్యదర్శి ప్రసాదరావు ఏలూరుకు బదిలీపై వెళ్లిన సందర్భంగా బుధవారం ఏఎంసీ సిబ్బంది వీడ్కోలు పలికారు.

ఆరోగ్య సురక్ష శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి



తిరువూరు 9వ సచివాలయంలో పరీక్షలు చేస్తున్న వైద్యశిబిరం



తిరువూరులో రోగులకు మందుల కిట్లను అందజేస్తున్న కస్తూరిబాయి

తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ కస్తూరిబాయి

తిరువూరు: రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో ఉచిత వైద్య శిబిరాలను రోగులు సద్వినియోగం చేసుకోవాలని తిరువూరు నగర పంచాయతీ చైర్‌పర్సన్ గత్తం కస్తూరిబాయి అన్నారు. స్థానిక 9వ సచివాలయం పరిధిలో బుధవారం జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించి మాట్లాడారు. కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా ప్రభుత్వాస్పత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఆధునికీకరించిన ప్రభుత్వం 104 వైద్యసేవలను విస్తృత పరిచిందన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.25 లక్షల గరిష్ఠ వ్యయాన్ని ప్రభుత్వమే భరించి రోగులకు నాణ్యమైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేస్తోందని చెప్పారు. శిబిరంలో 85 మంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. రక్తహీనత, జలుబు, దగ్గు, జ్వరం, రక్తపోటు, మధుమేహం, గుండె, కళ్ల సంబంధిత వ్యాధులకు వైద్యపరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు అందజేశారు. శస్త్ర చికిత్స అవసరమున్నవారిని గుర్తించి విజయవాడ ప్రభుత్వాస్పత్రికి సిఫారసు చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు చలమాల సత్యనారాయణ, వార్డు కన్వీనర్లు షేక్ జాకీర్, తిరుమలశెట్టి వేణుబాబు పాల్గొన్నారు. వైద్యులు గార్గేయ, మనోజ్, భానుతేజ, ప్రవీణ్ వైద్యసేవలందించారు.

వైద్యం చేరువయ్యేలా..

- శరవేగంగా ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణం
- రూ.80 లక్షలతో పనులు
- 10 పడకలతో శాశ్వత భవనం
- ల్యాబ్, రోగులకు విశ్రాంతి గదులు



ఎమ్మార్ అప్పారావు కాలనీలో నిర్మిస్తున్న ఆరోగ్య కేంద్ర భవనం

నూజివీడు: వైఎస్సార్ సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యత ఇస్తోంది. దీనిలో భాగంగానే పట్టణంలోని పేద ప్రజలందరికీ వైద్యాన్ని మరింత అందుబాటులోకి తీసుకు వచ్చేందుకు ప్రభుత్వం రెండు వైఎస్సార్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేసింది. పురపాలక సంఘం పరిధిలోని శివారు కాలనీ ప్రజలు దూరంగా ఉన్న ఏరియా ఆస్పత్రులకు వెళ్లలేరనే ఉద్దేశంతో వారికి మరింత దగ్గరగా ఉండి వైద్య సేవలందించాలనే సదుద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. ఏ చిన్న జబ్బు వచ్చినా ఆరోగ్య కేంద్రాలకు వచ్చేలా వీటిని ఏర్పాటు చేసింది. అయితే అరకొర వసతులు నడుమ అద్దె భవనాల్లో నడిపితే పేదలకు సరైన వైద్యసేవలు అందవనే ఉద్దేశంతో 10 పడకలతో కూడిన శాశ్వత ఆస్పత్రి భవనాలను ప్రభుత్వం నిర్మిస్తోంది. దీనిలో భాగంగా ప్రభుత్వం ఒక్కో దానికి రూ.80 లక్షలను మంజూరు చేసింది. వీటిల్లో పట్టణంలోని కోనేరుపేటలో భవన నిర్మాణాన్ని పూర్తిచేసి నాలుగు నెలల కిందట ప్రారంభించారు. రెండో ఆస్పత్రి భవన నిర్మాణ పనులు ఎమ్మార్ అప్పారావు కాలనీలో శరవేగంగా సాగుతున్నాయి. కొద్దిరోజుల్లోనే ఈ భవనాన్ని అందుబాటులోకి తెచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

శాశ్వత భవనాల నిర్మాణం

ఈ రెండు పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు శాశ్వత భవనాలను నిర్మించేందుకు ప్రభుత్వం రూ.1.60 కోట్లు మంజూరు చేసింది. నిర్మాణ పనులను పట్టణ పురపాలక సంఘం ఇంజినీరింగ్ విభాగం పర్యవేక్షిస్తోంది. పదివేల మందికి పైగా జనాభా ఉన్న ఎమ్మార్ అప్పారావు కాలనీలో ఆస్పత్రి భవన నిర్మాణం పూర్తయితే కాలనీలోని పేద ప్రజలకు వైద్య సదుపాయాలు అందుబాటులోకి రానున్నాయి.

రానున్న సౌకర్యాలు ఇవే..

నూతనంగా నిర్మించే పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో 10 పడకలు, ఫార్మసీ, ఔట్ పేషెంట్ గదులు, రెండు శస్త్రచికిత్స గదులు, ల్యాబొరేటరీ, రోగుల సహాయకులకు విశ్రాంతి గదులు, వైద్యుల గది ఉంటాయి. తగినంత వైద్య సిబ్బందిని ఏర్పాటు చేసి పేద ప్రజలకు వైద్యం అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యం



జగ్గయ్యపేట అర్బన్: ప్రజలకు నాణ్యమైన వైద్యసేవలందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని మున్సిపల్ వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్ అన్నారు. రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా స్థానిక పాత ఎన్ఎస్‌పీ క్వార్టర్స్‌లోని 14 వ సచివాలయం వద్ద 30, 31వ వార్డులకు సంబంధించి బుధవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ వైస్ చైర్మన్ ప్రభాకర్ మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా ప్రజల వద్దకే వెళ్లి నాణ్యమైన వైద్య సేవలను అందించే వినూత్నమైన కార్యక్రమం ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజారోగ్యానికి అధిక ప్రాధాన్యమిస్తున్నారని వివరించారు. శిబిరంలో ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ హరీష్, గైనకాలజిస్ట్ అరుణ, జనరల్ వైద్యులు షైలా, కంటి వైద్యులు శ్రీనివాస్ పాల్గొని 442 మందికి వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారని మున్సిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు తెలిపారు. కౌన్సిలర్లు పందుల రోశయ్య, గింజుపల్లి వెంకట్రామయ్య, వార్డు సచివాలయం కన్వీనర్ గింజుపల్లి కృష్ణ, పెనుగంచిప్రోలు మండల సచివాలయాల కన్వీనర్ కన్నమాల శామ్యూల్, వలంటీర్లు పాల్గొన్నారు.

● శివాపురం(పెనుగంచిప్రోలు): మండలంలోని శివాపురం గ్రామంలో బుధవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ (ఖమ్మం) వారు పేదపిల్లలకు దుప్పట్లు, స్నాక్స్, ఫ్యాన్సీ కిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తిరుపతమ్మ ఆలయ మాజీ చైర్మన్ లగడపాటి నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ లగడపాటి మోహనరావు మాట్లాడుతూ సేవా కార్యక్రమాలు ఎంతో తృప్తినిస్తాయన్నారు.